సాక్షి జగిత్యాల

గురువారం । 6 । జూలై । 2023



ఆషాఢ మాసం బోనాలు

జగిత్యాలటౌన్: ద్వారకానగర్ మేరు సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆషాఢ మాసం బోనాలు ఘనంగా నిర్వహించారు.



విత్తన శుద్ధిపై అవగాహన

కథలాపూర్ : విత్తనశుద్ధితో కలిగే ప్రయోజనాలపై శాస్త్రవేత్త రాజేంద్రప్రసాద్ పోసానిపేటలో అవగాహన కల్పించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0/25.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని పలుచోట్లు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఆలయ అభివృద్ధిపై సమీక్ష



మ్యాప్ పరిశీలిస్తున్న వల్లినాయగం

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ అభివృద్ధిపై రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ స్థపతి వల్లినాయగం బుధవారం అధికారులు, అర్చకులతో సమీక్షించారు. ఆలయ రాజగోపురం నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.38 లక్షలు విడుదల చేసింది. పనులు త్వరలో ప్రారంభించనున్నారు. అంతకుముందు స్థపతి దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో శ్రీనివాస్, సర్పంచ్ గర్షకుర్తి శిల్ప, అర్చకులు పెద్దసంతోష్, చిన్నసంతోష్, దేవాదాయ శాఖ ఏఈలు ప్రతాప్, లక్ష్మణ్‌రావుతోపాటు రాంచంద్రం, ధనుంజయ్ తదితరులు ఉన్నారు.

పారిశుధ్యం నిర్వహణపై శ్రద్ధ



మాట్లాడుతున్న రామానుజాచారి

కోరుట్లరూరల్: గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జెడ్పీ సీఈవో రామానుజాచారి సూచించారు. ధర్మారంలో బుధవారం ఆయన ఆకస్మికంగా పర్యటించారు. పారిశుధ్యం పనులు, మొక్కల పెంపకం, ఇంకుడు గుంతల పనులు పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలని సూచించారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీటీసీ సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.

హరితహారం లక్ష్యం నెరవేర్చాలి

- ఆపరేషన్ ముస్కాన్–9ను విజయవంతం చేయండి
- కలెక్టర్ యాస్మిన్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: జిల్లాకు నిర్దేశించిన హరితహారం లక్ష్యాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ యాస్మిన్ బాషా సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో అధికారులతో వివిధ కార్యక్రమాలపై కలెక్టర్ సమీక్షించారు. గ్రామాల్లో కమ్యూనిటీ ప్లాంటేషన్ చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటిదాకా ఎనిమిది విడతల హరితహారం పూర్తిచేసుకుని తొమ్మిదో విడతలోకి వెళ్తున్నామని అన్నారు. ఈసందర్భంగా రోడ్డుకు ఇరువైపులా మూడు లేయర్లలో మొక్కలు నాటాలని చెప్పారు. మొక్కల మధ్య రెండు అడుగుల దూరం తగ్గకుండా చూసుకోవాలని చెప్పారు. ఎంపీడీవోలు అందరూ గ్రామపంచాయతీలకు వెళ్లి మొక్కలు నాటే ప్రక్రియ తనిఖీ చేసి, ప్రణాళిక రూపొందించుకోవాలని ఆదేశించారు. ఎంపీడీవోలు, ఎంపీవోలు, సర్పంచుల ఆధ్వర్యంలో మొక్కల ప్లాంటేషన్ జరగాలని ఆదేశించారు. మొక్కలు నాటిన తర్వాత అలాగే వది లేయకుండా ట్రీగార్డులు ఏర్పాటు చేసి సంరక్షిస్తూ నీరు పోయాలని పేర్కొన్నారు. ముఖ్యంగా ఎర్రమట్టి ఎరువు ముఖ్యమన్నారు. క్రీడా ప్రాంగణాలు, సంపద వనాల్లో మొక్కలు చాలా నాటాలని చెప్పారు. డీఆర్డీవో నరేశ్, డీపీవో దేవరాజ్, అటవీశాఖ అధికారి వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

బాల కార్మిక రహిత జిల్లాగా మార్చేందుకు ఆపరేషన్ ముష్కాన్–9ను విజయవంతం చేయాలని కలెక్టర్ యాస్మిన్ బాషా సూచించారు. పిల్లలతో పనిచేయించడం, భిక్షాటన చేయించడం, వేధింపులకు గురిచేయడం, వెట్టిచాకిరీ చేయించడం నేరమని, ఇలాంటి పనులు చేయించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆపరేషన్ ముస్కాన్–9పై జిల్లా కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఏమైనా సమస్యలు ఉంటే 1098 నంబరుకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాల ని సూచించారు. జిల్లా సంక్షేమాధికారి నరేశ్ ఉన్నారు.

కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయండి



విత్తనాలు నాటుతున్న మల్లేశం

జగిత్యాలరూరల్: జిల్లావ్యాప్తంగా ప్రతీ గ్రామంలో మహిళా సంఘాల సభ్యులు కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేసుకోవాలని సెర్ప్ డీపీఎం మల్లేశం సూచించారు. చల్‌గల్ గ్రామంలో ఆయన బుధవారం ఆకస్మికంగా పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడారు. మహిళలు తమ ఇళ్ల సరిసరాల్లోని ఖాళీ స్థలాల్లో కూరగాయలు, పూలమొక్కలు, పండ్లమొక్కలు పెంచుకోవాలని సూచించారు. తద్వారా నాణ్యమైన కూరగాయలు, పండ్లు లభించే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఏళ్ల గంగనర్సు, ఏపీఎం గంగాధర్, సీసీ గంగారాం, వీవోఏ స్వప్న, సభ్యులు ఎర్ర వినోద, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల సవాల్



- పోలీసులు అప్రమత్తమైనా ఆగని నేరాలు
- ఈ ఏడాది ఇప్పటి వరకు 414 కేసులు
- ఆందోళన చెందుతున్న జిల్లావాసులు
- బాధితుల కోసం టోల్‌ఫ్రీ నంబర్లు 1930, 100

సారంగాపూర్ మండలం లచ్చక్కపేట గ్రామానికి చెందిన దీటి వెంకటేశ్ పటేల్ మొబైల్‌కు ఇటీవల ఓ కంపెనీ పేరిట మెసేజ్ వచ్చింది.. ఆ వెంటనే ఓ నంబరు నుంచి ఫోన్‌చేసిన ఓ వ్యక్తి.. 'మీ మొబైల్‌కు వచ్చిన ఫజిల్ పూరించి టెలిగ్రామ్ యాప్ ద్వారా పంపిస్తే అధిక మొత్తంలో మేం తిరిగి చెల్లిస్తాం' అని చెప్పాడు. ఆ ప్రకారం టాస్క్ పూరించి పంపించగా రూ.120 వెంకటేశ్ బ్యాంకు ఖాతాలో జమయ్యాయి. ఆ తర్వాత రూ.5 వేలు పంపించగా క్షణాల్లో రూ.6,500 జమయ్యాయి. ఇలా మరోసారి రూ.8వేలు పంపించగా.. రూ.28వేలు రావాల్సి ఉంది.. కానీ.. ఎంతకీ ఆ సొమ్ము రాకపోవడంతో తాను మోసపోయానని బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.

జగిత్యాలక్రైం: అభివృద్ధి చెందుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ నేరగాళ్లు వివిధ మార్గాల్లో ప్రజలను నమ్మించి మోసం చేస్తూనే ఉన్నారు. ఇలాంటి నేరాలను అరికట్టేందుకు జిల్లా పోలీసులు అప్రమత్తమై ప్రజల్ని చైతన్యవంతం చేస్తున్నా ప్రయోజనం లేకుండా పోతోంది. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు నమోదైన 414 సైబర్ కేసులే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

వెంటనే స్పందిస్తే మేలు..

- 2022లో జిల్లావ్యాప్తంగా 635 సైబర్ నేరాలు జరిగాయి. బాధితులు రూ.1,92,65,117 కోల్పోయారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు అప్రమత్తమై సైబర్ నేరగాళ్ల ఖాతాలు స్తంభింపజేశారు. 158 కేసుల్లో రూ.17,17,299 రికవరీ చేశారు.
- 2023లో జనవరి నుంచి ఇప్పటివరకు 414 కేసులు నమోదయ్యాయి. ఇందులో బాధితులు రూ.1,78,59,564 కోల్పోయారు. పోలీసులు 172 కేసుల్లో రూ.32,15,409 స్వాధీనం చేసుకున్నారు.

ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నంబర్లు.. 1930, 100

- సైబర్ నేరాల బారినపడిన వారు వెంటనే స్పందించి డయల్ 1930తోపాటు నంబరు 100కు డయల్ చేస్తే తక్షణమే పోలీసులు స్పందిస్తున్నారు. సైబర్ నేరస్తుల బ్యాంకు ఖాతాలు గుర్తించి రిజర్వ్ బ్యాంక్ సాయంతో వాటిని స్తంభింపజేస్తున్నారు. సొత్తు రికవరీ చేస్తున్నారు.

మోసాలు ఇలా చేస్తున్నారు..

- సైబర్ నేరాల్లో అధికంగా క్రెడిట్, డెబిట్‌కార్డులు, ఓటీపీ ఫ్రాడింగ్‌లు అధికంగా ఉంటున్నాయని పోలీసులు తెలిపారు. తాము ఫలానా బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తున్నామని, లక్కీ లాటరీ తగిలిందని, ఓటీపీ చెప్పాలంటూ బ్యాంకు ఖాతాల్లోంచి సొమ్ము కాజేస్తున్నారు. మొబైల్ ఫోన్లకు యాప్‌లు పంపించి డౌన్‌లోడ్ చేసుకుంటే క్యాష్ బ్యాక్ వస్తుందని నమ్మించి సొమ్ము కాజేస్తున్నారు.

విద్యార్థి స్థాయి నుంచే అవగాహన..

- జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, మొబైల్ ఫోన్ల వినియోగంలో జాగ్రత్తలు తదితర అంశాలపై విద్యార్థి దశ నుంచే అవగాహన కల్పిస్తోంది. ఇందుకోసం ప్రతీ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాఠశాలలు, కళాశాలలు, గ్రామాలు, పట్టణాల్లోని ప్రధాన కూడళ్లలో సదస్సులు ఏర్పాటు చేస్తోంది.

ఉద్యోగం ఇప్పిస్తామని..

జిల్లా కేంద్రంలోని శంకులపల్లికి చెందిన వ్యాపారి మొంగు సూరజ్ నుంచి సైబర్ నేరగాళ్లు దశల వారీగా రూ.3.85 లక్షలు కాజేశారు. ఓ వ్యాపారం చేసే సూరజ్ మొబైల్ వాట్సాప్‌కు జూన్ 28న ఒక లింక్ వచ్చింది. దానిని ఓపెన్ చేసి చూడగా.. ఓ ఫోన్ నంబరు కనిపించింది. దానికి ఫోన్ చేయగా.. రూ.వెయ్యి పంపిస్తే ఉద్యోగం పెట్టిస్తామని, ఇందుకోసం యూపీఐ ఐడీ ద్వారా రూ.వెయ్యి టాస్క్ కోసం పంపించాలని అవతలి వ్యక్తులు కోరారు. దీంతో వ్యాపారి రూ.వెయ్యి పంపించాడు. ఆ తర్వాత సైబర్ నేరగాళ్లు సూరజ్ ప్రమేయం లేకుండానే దశలవారీగా రూ.3.85 లక్షలు కాజేశారు. కానీ, ఉద్యోగం రాలేదు. మోసపోయానని తెలుసుకున్న బాధితుడు బుధవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నటేశ్ తెలిపారు.

సత్వరమే ఫిర్యాదు చేయండి

జిల్లాలో సైబర్ నేరస్తుల బారినపడ్డవారు వెంటనే స్పందించి టోల్‌ఫ్రీ నంబర్లు 1930, 100కు ఫిర్యాదు చేయండి. పోలీసులు అప్రమత్తమై ఆర్బీఐ సాయంతో సైబర్ నేరగాళ్ల బ్యాంక్ ఖాతాలు నిలిపివేస్తారు. బాధితులు కోల్పోయిన సొమ్ము రికవరీ చేస్తారు.

– భాస్కర్, ఎస్పీ

జిల్లాలో నమోదైన సైబర్ కేసులు

సంవత్సరం	కేసులు
2022	635
2023(ఇప్పటివరకు)	414

గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం

- ప్రజావసరాల మేరకు నిధులు
- సాంఘిక సంక్షేమ మంత్రి కొప్పుల ఈశ్వర్
- పల్లెల్లో సీసీ రోడ్లు ప్రారంభం



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న మంత్రి ఈశ్వర్

పెగడపల్లి(ధర్మపురి): గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. నామాపూర్, కీచులాటపల్లి గ్రామాల్లో బుధవారం మంత్రి పర్యటించారు. సుమారు రూ.కోటి వెచ్చించి నిర్మించిన సీసీరోడ్లు ప్రారంభించారు. సంక్షేమ సంఘ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మంత్రి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజావసరాల మేరకు నిధులు కేటాయిస్తున్నామన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో గ్రామాలు అభివృద్ధిలో వెనుకబడి పోయయాని విమర్శించారు. పల్లెప్రగతి ద్వారా విడుదల చేస్తున్న ప్రత్యేక నిధులతో గ్రామాల్లో ప్రజావసరాల మేరకు అభివృద్ధి చేసుకుంటున్నామని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత పల్లెలన్నీ పట్టణాలుగా రూపుదిద్దుకుంటున్నాయని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలతో రాష్ట్రం నేడు అన్నిరంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధించిందని మంత్రి కొప్పుల చెప్పారు. అభివృద్ధిని ఓర్వలేని ప్రతిపక్ష నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ప్రజలు వాటిని నమ్మొద్దని కోరారు. రానున్న రోజుల్లో సీఎం కేసీఆర్ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ శోభ, సర్పంచులు కరుణాకర్‌రెడ్డి, స్వప్న, ఎంపీటీసీలు అంజయ్య, రవి, రజిత, మాజీ ఎంపీటీసీ ఆనందం, వైస్ ఎంపీపీ గంగాధర్, ఏఎంసీ వైస్ చైర్మన్ అంజి, సింగిల్‌విండో చైర్మన్లు భాస్కర్ రెడ్డి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జగిత్యాల: వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆర్యవైశ్య కార్పొరేషన్ సాధన సమితి నాయకులు కోరారు. ఈమేరకు బుధవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆర్యవైశ్యుల మనోభావాలను గౌరవించి వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాధన సమితి నాయకులు రాజన్న, పద్మ, భాస్కర్ పాల్గొన్నారు.

పంట రుణాలు ఇవ్వాలి

జగిత్యాలటౌన్: జిల్లాలోని పోడు, అసైన్డ్ భూములు కలిగిన రైతులకు పంట రుణాలు ఇవ్వాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. ఈమేరకు కలెక్టర్ యాస్మిన్‌బాషాకు బుధవారం లేఖ రాశారు. ప్రభుత్వం యాజమాన్య హక్కులు కల్పించిన పోడు భూములకు పంట రుణాలు మంజూరు చేసేలా బ్యాంకర్లను ఆదేశించాలని కోరారు. గతంలో పంపిణీ చేసిన వాటితోపాటు అసైన్ భూములకు ధరణి పట్టాదారు పాసు పుస్తకాలు చేయలేదని, ఇలాంటి వాటికి రైతుబంధు సాయం అందుతోందని తెలిపారు. అయితే, బ్యాంకులు పంట రుణాలు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. దీంతో దళిత, బడుగు, బలహీన వర్గాలు, గిరిజన రైతులు పెట్టుబడి సమకూర్చుకోలేక ఇబ్బందులు పడుతున్నారని గుర్తుచేశారు. సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఆయన విన్నవించారు.

సర్పంచ్ దంపతుల రాజీనామా

కథలాపూర్(వేములవాడ): తక్కళ్లపెల్లి సర్పంచ్ దంపతులు మొలిగె లక్ష్మి– శ్రీనివాస్ బీజేపీకి రాజీనామా చేస్తున్నట్లు బుధవారం ప్రకటించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్‌ను అధ్యక్ష పదవి నుంచి తొలగించినందుకు నిరసనగా తాము పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు రాజీనామా పత్రాలను బీజేపీ జిల్లా ప్రతినిధులకు పంపించామని వివరించారు.

సారంగాపూర్‌లో..

సారంగాపూర్(జగిత్యాల): బీజేపీ నాయకులు పొలగాని మల్లేశం, బాస నాగేందర్‌తోపాటు వారి అనుచరులు పార్టీకి రాజీనామా చేశారు. బండి సంజయ్‌ను అధ్యక్ష పదవి నుంచి తొలగిండాన్ని నిరసిస్తూ తాము రాజీనామా చేస్తున్నామని వారు పేర్కొన్నారు.

సోషల్ మీడియాలో ప్రచారంపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న సుదర్శన్

జగిత్యాలక్రైం: జిల్లాలోని ప్రముఖ బేకరీ పికప్ పాయింట్‌లో తినుబండారాలతో ఫుడ్ పాయిజన్ అయిందని వాట్సాప్‌లో కొందరు అసత్య ప్రచారం చేశారు. వీరిపై చర్యలు తీసుకోవాలని షాపు యజమాని శివ సుదర్శన్ బుధవారం పట్టణ సీఐ నటేశ్‌కు ఫిర్యాదు చేశారు.

వెంటపడి కరుస్తున్నాయి..



ఇతడి పేరు తాలుక కొమురయ్య, కథలాపూర్ మండలం చింతకుంట స్వగ్రామం. గతనెల 30న తన పంటచేను వద్దకు వెళ్తుండగా కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. స్థానికులు వచ్చి కుక్కలను వెళ్లగొట్టడంతో ప్రాణాపాయం తప్పింది. ఇలా కథలాపూర్, మేడిపెల్లి మండలాల్లో కుక్కల బారినపడుతున్న వారి వేదన వర్ణణాతీతం.

- ఇళ్లనుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్న జనం
- రహదారులపైకి వచ్చేందుకు పిల్లలు, విద్యార్థుల్లో భయం
- కథలాపూర్, మేడిపెల్లి మండలాల్లో కుక్కల బెడద తీవ్రం

కథలాపూర్(వేములవాడ): విశ్వాసానికి మారుపేరు కుక్కలు. అలాంటి వీధి కుక్కలు గ్రామాల్లో ప్రజలను కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. రాత్రి, పగలు తేడాలేకుండా ప్రజలపై దాడిచేసి గాయపరుస్తున్నాయి. దీంతో జనాలు రోడ్లపైకి వచ్చేందుకు జంకుతున్నారు. మనుషులేకాదు.. మూగజీవాలపైనా దాడులు చేస్తున్నాయి. అయినా అధికారులు నియంత్రణ చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

తరచూ ఘటనలు..



భూషణరావుపేటలో రోడ్డుపై కుక్కల గుంపు

- కథలాపూర్, మేడిపెల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో తరచూ వీధికుక్కలు ప్రజలపై దాడులు చేస్తున్నాయి.
- గుంపులు గుంపులుగా తిరగడంతో రోడ్డుపై వెళ్లేవారు వాటిని చూసి జంకుతున్నారు.
- చిన్నారులు, విద్యార్థులు కూడా రోడ్డుపై వచ్చేందుకు భయపడుతుండగా.. తల్లిదండ్రులు పిల్లలను ఒంటరిగా వెళ్లనివ్వడంలేదు.
- రాత్రివేళల్లో బైక్‌లపై వెళ్లేవారిని వెంబడించి గాయపరుస్తున్నాయి.
- కుక్కలను గమనించకుండా వెళ్లిన పలువురు బైక్‌ల పైనుంచి అదుపుతప్పి పడిపోయి గాయాలపాలవుతున్నారు.
- కథలాపూర్ మండలం సిరికొండ, చింతకుంట, తక్కళ్లపెల్లి, మేడిపెల్లి మండలం కల్వకోట, వల్లంపెల్లి గ్రామాల్లో ఇటీవల కుక్కలు రోడ్డుపై వెళ్తున్న ప్రజలను వెంటాడి ఎగబడి గాయపరిచిన సంఘటనలు చోటుచేసుకున్నాయి.

రాత్రివేళ బైక్‌లపై వెళ్తే అంతే..

రాత్రివేళల్లో గ్రామాల్లో వివిధ పనుల నిమిత్తం బైక్‌లపై వెళ్లేవారిని కుక్కలు వదలడంలేదు. బైక్‌లను వెంబడించి మరీ దాడులు చేస్తున్నాయి. వేకువజామున పంట పొలాలకు వెళ్లే రైతులు సైతం వాటి బెడదతో బెంబేలెత్తిపోతున్నారు. ఇతర గ్రామాల నుంచి స్వగ్రామాలకు చేరుకోవడానికి రాత్రివేళ బైక్‌లపై వస్తే కుక్కలు వెంబడించడంతో ప్రమాదాలకు గురవుతున్నారు.

కుక్కల దాడిలో గాయపడ్డవారు

మండలం	మే	జూన్
కథలాపూర్	46	43
మేడిపెల్లి	51	41

అధికార యంత్రాంగం నిర్లక్ష్యం..

ఆయా గ్రామాల శివారుల్లో కొందరు విందులు చేసుకొని తినుబండారాలు వదిలేయడం, చికెన్, మటన్ సెంటర్ నిర్వాహకులు వ్యర్థాలను గ్రామ శివారుల్లోనే పడవేయడంతో కుక్కలకు అక్కడ నిత్యం ఆహారం లభిస్తోంది.

- దీంతో ఆయా ప్రాంతాలను శునకాలు ఆవాసాలుగా చేసుకుని, ప్రజలపై దాడులు చేస్తున్నాయి.
- అయినా, వాటి నియంత్రణకు అధికార యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

వెంబడిస్తున్నాయి



సిరికొండ, తక్కళ్లపెల్లి గ్రామాల్లో ఏ వాడలో చూసినా కుక్కల గుంపులే కనిపిస్తున్నాయి. ఇంటినుంచి బయటకు వెళ్తే మొరుగుతూ వెంబడిస్తున్నాయి. రాత్రివేళల్లో బైకులపై వెళ్లేవారిని వెంబడించి కరుస్తున్నాయి. కొందరు బైకులపై పడిపోయి గాయాలపాలయ్యారు. చిన్నారులు తినుబండరాలు కొనుగోలు చేసేందుకు దుకాణాలకు వెళ్తే.. వారి చేతిల్లోని ఆహార పదార్థాలు లాక్కుంటున్నాయి. ఒక్కోసారి వారిపై దాడి చేసి గాయపర్చుతున్నాయి. అధికారులు చొరవ చూపి కుక్కల బెడద నుంచి కాపాడాలి.

– కోట శంకర్, తక్కళ్లపెల్లి

చర్యలు తీసుకుంటాం



గ్రామాల్లో కుక్కల బెడద ఉందని ప్రజల ద్వారా తెలిసింది. గ్రామాలవారీగా వాటి వివరాలు సేకరిస్తాం. కుక్కలను పట్టించి దూరప్రాంతాల్లో వదిలివేయించేలా చర్యలు తీసుకుంటాం. పశువైద్య శాఖ అధికారులతో మాట్లాడి తగిన నిర్ణయం తీసుకుంటాం. ప్రజలు ఆందోళన చెందవద్దు.

శంకర్, డివిజనల్ పంచాయతీ అధికారి, కోరుట్ల

అపోలో రీచ్‌లో అరుదైన శస్త్రచికిత్స



మాట్లాడుతున్న వైద్యులు

కరీంనగర్‌టౌన్: అపోలో రీచ్ ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స చేసినట్లు హాస్పిటల్ కార్డియాలజిస్టు డాక్టర్ అనిల్‌కుమార్ ముల్వార్, న్యూరో వైద్యుడు సంజయ్ కుమార్ తెలిపారు. బుధవారం దవాఖానాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కరీంనగర్‌కు చెందిన కాశెట్టి శ్రీనివాస్, అంజలి దంపతుల కూతురు సాయిశ్రీ పాఠశాలలో అకస్మాత్తుగా కిందపడిపోవడంతో కుడికాలు, కుడి చేయి చచ్చుపడిపోయి, మాట కూడా రాలేదు. తల్లిదండ్రులు దగ్గరలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు అపోలో రీచ్ ఆస్పత్రిలో చేర్పించారు. సాయిశ్రీని పరీక్షించిన డాక్టర్లు మెదడులో రక్తం గడ్డ కట్టడం వల్ల కాలు, చేయి పడిపోయాయని గుర్తించారు. అత్యాధునిక ఫిలిప్స్ ఆజ్యూరియస్ వంటి సాంకేతికతతో సెరబ్రల్ యాంజియోగ్రఫీ, మెకానికల్ తంబెక్టమి అనే ప్రత్యేక పద్ధతిలో ఆపరేషన్ చేశారు. అయితే ఇంత చిన్న వయసులో రక్తం గడ్డకట్టడం ఏమిటన్న సందేహంతో పాపకు మరిన్ని పరీక్షలు నిర్వహించగా గుండె లోపల కణితి ఉన్నట్లు గుర్తించారు. దీన్ని వైద్య భాషలో ఎలమిట్టోమా అంటారని, ఇది అరుదుగా వస్తుందని వైద్యులు తెలిపారు. చిన్నారికి వెంటనే ఆపరేషన్ చేసి, కణితిని తొలగించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం పాప పూర్తిగా కోలుకుందన్నారు. సమావేశంలో ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ నాగసతీశ్, వైద్యులు, సిబ్బంది, చిన్నారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అవగాహన అవసరం



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై సదాకర్

జగిత్యాలక్రైం: సైబర్ నేరాలపై ప్రతీఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ భాస్కర్ సూచించారు. సైబర్ జాగృక్త దివస్ కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలో ప్రజలకు సైబర్ నేరాలు, సైబర్ భద్రతపై అవగాహన కల్పించారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, యువత, ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నామని ఎస్పీ పేర్కొన్నారు. ప్రజల్ని చైతన్య పరచడమే పోలీసుల లక్ష్యమన్నారు. ప్రస్తుతం వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ వంటి సోషల్ మీడియాను పిల్లలు అధికంగా వినియోగిస్తున్నారని, సైబర్‌నేరగాళ్లు వాటి ఆధారంగా మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. సామాజిక మాధ్యమాల వినియోగ సమయంలో జాగ్రత్తలు తీసుకునేలా తల్లిదండ్రులు వివరించాలని సూచించారు.

అప్రమత్తంగా ఉండండి

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పట్టణ సీఐ నటేశ్ సూచించారు. స్థానిక నలంద డిగ్రీ కళాశాలలో బుధవారం 'సైబర్ క్రైం' అంశంపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ, అపరిచితుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్ ఎత్తవద్దని, వ్యక్తిగత వివరాలు వెల్లడించవద్దన్నారు. వాట్సాప్ మెసేజ్‌లు, యాప్ లింక్‌లు క్లిక్ చేయవద్దని చెప్పారు. ప్రిన్సిపాల్ నరేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

మోసాలు.. అనేక రూపాలు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని జగిత్యాల రూరల్ ఎస్సై సదాకర్ సూచించారు. సైబర్ జాగరూకత దివస్ కార్యక్రమంలో భాగంగా చల్‌గల్ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ, సైబర్ నేరస్తులు ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్, బెట్టింగ్‌ఫ్రాడ్, సెక్స్ టార్చర్, లోన్ యాప్‌ల పేరిట మోసాలకు పాల్పడుతున్నారన్నారు. ఇలాంటి వారితో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లోన్, లాటరీ పేరిట వచ్చే మెసేజ్‌లు, సోషల్ మీడియాలోని ప్రకటనలు చూసి ఆశపడి మోసపోవద్దని హితవు చెప్పారు.

తాళం వేసిఉన్న ఇళ్లలో చోరీ

కోరుట్లరూరల్: అయిలాపూర్ గ్రామంలో మంగళవారం రాత్రి తాళం వేసిఉన్న మూడు ఇళ్లలో చోరీ జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కుందేళ్ల శంకర్, రాణవేని గంగారాం కుటుంబ సభ్యులు తమ ఇళ్లకు తాళం వేసి మరో చోట నిద్రిస్తున్నారు. ఈక్రమంలో దొంగలు ఆ ఇంటి తాళం పగులగొట్టి లోనికి దూరి చోరీకి పాల్పడ్డారు. కుందేళ్ల శంకర్ ఇంట్లో తులం బంగారం, రూ.30 వేల నగదు, రాణవేని గంగారాం ఇంట్లో ఒకతులం బంగారం ఎత్తుకెళ్లారు. మరోఇంటి తాళం కూడా పగులగొట్టారని స్థానికులు పేర్కొన్నారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు.

ఎమ్మెల్యే వైఫల్యంతోనే రోడ్డు పనుల్లో జాప్యం

- కాంగ్రెస్ పార్టీ రాజన్న సిరిసిల్ల అధ్యక్షుడు ఆది శ్రీనివాస్

కథలాపూర్(వేములవాడ): వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు వైఫల్యంతోనే చందుర్తి– మోత్కురావుపేట రోడ్డు పనుల్లో జాప్యం జరుగుతోందని కాంగ్రెస్ పార్టీ రాజన్న సిరిసిల్ల అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ ఆరోపించారు. బుధవారం మేడిపెల్లి మండలం కొండాపూర్, భీమారం మండలం కమ్మరిపేటలో ఆయన పర్యటించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోత్కురావుపేట–చందుర్తి రోడ్డు పనులను ప్రారంభించి ఐదేళ్లు గడిచినా పూర్తికావడం లేదన్నారు. ఇది పాలకుల నిర్లక్ష్యం కాదా? అని ప్రశ్నించారు. రోడ్డు పనులకు అటవీశాఖ అనుమతి లేదని కాలయాపన చేయడం దారుణమన్నారు. మేడిపెల్లి, భీమారం మండలాలను కోనసీమగా మార్చుతామని చెప్పి ఇప్పటికీ సూరమ్మ ప్రాజెక్టు కాలువ పనులు ప్రారంభించకపోవడం ఎమ్మెల్యే రమేశ్‌బాబు నిర్లక్ష్యమేనని దుయ్యబట్టారు. ఎన్నికలప్పుడు కల్లిబొల్లి మాటలు చెప్పి.. ఆ తర్వాత విస్మరించడం ఆయనకు అలవాటుగా మారిందని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు నీరటి మల్లేశం, ఉరుమడ్ల లక్ష్మణ్, పుప్పాల కొమురయ్య, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల డిమాండ్

జగిత్యాలటౌన్: కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజు దోపిడీ అరికట్టాలని, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో బుధవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని, మౌలిక వసతులు కల్పించి, విద్యాప్రమాణాలు మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో పాఠ్యపుస్తకాల అమ్మకాలను నిషేధించాలని, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం జిల్లా విద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురికి తీవ్రగాయాలు

- మరో ఇద్దరికి స్వల్పగాయాలు
- ఒకరి పరిస్థితి విషమం

మల్యాల(చొప్పదండి): రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొని ముగ్గురు గాయపడిన సంఘటన తాటిపల్లి శివారులో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. తాటిపల్లి గ్రామానికి చెందిన దాసరి మల్లేశం, గంప మల్లయ్య మల్యాల నుంచి బైక్‌పై తాటిపల్లి వెళ్తున్నారు. ఇదే సమయంలో లంబాడిపల్లి గ్రామానికి చెందిన యువకుడు కట్కూరి వంశీ బైక్‌పై మల్యాల వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో తాటిపల్లి బాలికల గురుకుల కళాశాల సమీపంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొని వెనుకాలే వస్తున్న మరో బైక్‌పైకి దూసుకెళ్లారు. ఈ సంఘటనలో లంబాడిపల్లికి చెందిన కట్కూరి వంశీ తలకు తీవ్ర గాయాలు కాగా, మరో ఇద్దరు గాయపడ్డారు. మరో బైక్‌పై వెళ్తున్న తాటిపల్లికి చెందిన భార్యభర్తలు బెజ్జంకి రాజబాపు, సుజాత స్వల్పంగా గాయపడ్డారు. బాధితులను స్థానికులు 108 వాహనంలో జగిత్యాలకు తరలించారు. ఇందులో యువకుడి పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌కు తరలించారు.

జగిత్యాలలో ముగ్గురికి..

జగిత్యాలక్రైం: స్థానిక కరీంనగర్ రోడ్డులోని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం వద్ద బుధవారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరికి బలమైన గాయాలు కావడంతో రోడ్డుపై పడిపోయారు. దీంతో సుమారు అర్ధగంటపాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. సమాచారం అందుకున్న పట్టణ సీఐ నటేశ్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. 108 అంబులెన్స్‌కు ఫోన్ చేయగా, వారు స్పందించలేదు. దీంతో గాయపడ్డవారిని ఆటోలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

అనారోగ్య సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య



కాటిపెల్లి తిరుపతిరెడ్డి(ఫైల్)

మల్లాపూర్(కోరుట్ల): అనారోగ్య సమస్యలతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెందిన కాటిపెల్లి తిరుపతిరెడ్డి (38) పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. కొత్తదాంరాజుపల్లి గ్రామానికి చెందిన కాటిపెల్లి తిరుపతిరెడ్డి– శ్రీదేవి దంపతులు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. తిరుపతిరెడ్డి రెండేళ్లుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. వివిధ ఆస్పత్రుల్లో చికిత్స తీసుకున్నా నయం కాలేదు. దీంతో కొంతకాలంగా మనోవేదనతో ఉంటున్నాడు. తన ఆరోగ్య సమస్యలు ఇక తొలగిపోవంటూ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. ఈక్రమంలో మంగళవారం జీవితంపై విరక్తి చెందాడు. ఆ వెంటనే పురుగులమందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.

జనావాసాల్లో స్క్రాప్ దందా

జగిత్యాల టీఆర్‌నగర్ చౌరస్తాలోని స్క్రాప్ దుకాణంలో మంగళవారం అగ్నిప్రమాదం సంభవించింది. ప్రమాదవశాత్తు జరిగిన ఈ ఘటనలో పెద్దఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. స్థానికులు అప్రమత్తం కావడం, అగ్నిమాపక సిబ్బంది సకాలంలో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. వీరిలో ఎవరు స్పందించకున్నా.. సమీపంలోని జనావాసాలు అగ్నికీలల్లో చిక్కుకుని బూడిదయ్యేవి.

- తరచూ ప్రమాదాలు
- బిక్కుబిక్కుమంటున్న ప్రజలు



జగిత్యాల జంబిగద్దె ప్రాంతంలో ఉన్న స్క్రాప్ దుకాణం



పురాణిపేటలో జనావాసాల మధ్య స్క్రాప్ దుకాణం

జగిత్యాల: జిల్లాని వివిధ ప్రాంతాల్లో జనావాసాల్లోనే స్క్రాప్ దందా సాగిస్తున్నారు. వీటిలో తరచూ అగ్నిప్రమాదాలు సంభవిస్తున్నాయి. స్థానికులు, అగ్నిమాపక అధికారులు సకాలంలో స్పందించడంతో ప్రాణ, ఆస్తినష్టం జరగడంలేదు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న కొన్ని స్క్రాప్ దుకాణ యజమానులపై అధికారులు ఇప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు.

అనేకచోట్ల దందా..

- జిల్లాలోని అనేకచోట్ల స్క్రాప్ దందా కొనసాగుతోంది.
- జగిత్యాల పురాణిపేటలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయం సమీపంలో జనావాసాల్లోనే స్క్రాప్ దుకాణం ఉంది.
- దీనికి సమీపంలోనే కళాశాలలు, దేవాలయం ఉన్నాయి.
- జగిత్యాల జంబిగద్దె ప్రాంతంలోని మరో స్క్రాప్ దుకాణం కూడా పూర్తిగా జనావాసాల మధ్య ఏర్పాటు చేశారు.
- దీని పరిసరాల్లోనే అనేక ఆస్పత్రులు ఉన్నాయి.
- నిత్యం వేలాది మంది ఈ మార్గం నుంచే రాకపోకలు సాగిస్తున్నారు.
- రహదారులు, బహిరంగ ప్రదేశాల్లో చెత్తవేసి కాల్చివేస్తున్నారు.
- ఏమాత్రం అప్రమత్తంగా లేకున్నా.. స్క్రాప్ దుకాణాల్లోకి నిప్పురవ్వలు ఎగిసి పడితే అగ్నిప్రమాదాలు సంభవిస్తాయని స్థానికులు భయపడుతున్నారు.

ఒప్పందం విస్మరించిన బల్దియాలు..

జిల్లాలోని కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్‌తోపాటు జగిత్యాల మున్సిపాలిటీ అధికారులు తడి, పొడి చెత్త వేరు చేస్తున్నారు. ఇలా చేసే సమయాల్లో లభించే స్క్రాప్‌ను ఒప్పందం మేరకు స్క్రాప్ దుకాణ నిర్వాహకులకు అప్పగించి దూర ప్రాంతాలకు తరలించాలి. కానీ, అధికారులు అలాంటి ఒప్పందాలు ఏమీ చేసుకోవడం లేదని తెలిసింది.

ప్రమాద కారకాలు..

- స్క్రాప్ దుకాణాల్లో పనిచేయని ఫ్యాన్లు, విరిగిన కుర్చీలు, కాగితపు ప్లేట్లు, టీకప్పులు, గ్లాసులు, చెంబాలు, కత్తులు తదితర వస్తు సామగ్రి నిల్వ చేస్తున్నారు.
- ఇవన్నీ మంటలు అంటుకుని కాలిపోయేవే.

అమలుకు నోచుకోని నిబంధనలు..

- అగ్ని ప్రమాదాల నియంత్రణకు స్క్రాప్ దుకాణాదారులు ఏర్పాట్లు చేసుకోవాలి. దుర్గంధం వెదజల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. సురక్షిత ప్రాంతంలో స్క్రాప్ నిల్వచేయాలి. రోడ్లపై నిల్వచేయరాదు. కొందరు నిర్వాహకులు ఇవేమీ పాటించడంలేదు. మరికొందరు ట్రేడ్ లైసెన్స్‌లు లేకుండానే దుకాణాలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

నోటీసులు ఇచ్చాం

జిల్లాలో కొన్నిచోట్ల జనావాల మధ్యలో స్క్రాప్ దుకాణాలు కొనసాగుతున్నాయి. ఈవిషయం మా దృష్టికి వచ్చింది. ఇలాంటి వారికి ఇప్పటికే నోటీసులు జారీచేశాం. ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

– నరేశ్, మున్సిపల్ కమిషనర్, జగిత్యాల